# మౌనం

మన చుట్టూ వుండే మనషుల్లో కొందరు సరదాగా వుండటం... మరికొందరు గంభీరంగా, మౌనంగా వుండటం చూస్తూ ఉంటాం.

నవ్వుతూ నవ్విస్తూ ఉండే వాళ్ళు అందర్నీఆకట్టుకుంటే, మౌనంగా వుండేవాళ్ళు ఎదుటివాళ్ళని అల్లంతదూరంలో ఉంచేస్తారు.

ఎప్పుడూ సరదాగా ఉండేవాళ్ళు అనుకోకుండా శృతిమించి మట్లాడినప్పుడు తమ హాస్యం వికటించి ఎదుటివాళ్ళు తమని ఏ రకంగా అపార్థం చేసుకున్నారో తెలిసొచ్చి అవాక్కయిపోవడమో, ఖిన్నులయిపోవడమో చూస్తూ వుంటాం!

అయితే.... అందరూ నవ్వుతూ ఉండే సందర్భాల్లో... 'మౌనం'గా ఉన్నా - విషాద సమయాల్లో.. జోకులేసుకుంటూ 'సరదా' గా ఉన్నా - చూసేవాళ్ళకి ఎబ్బెట్టుగా, 'వీళ్ళేం మనుషులబ్బా?' అనుకునేట్టు చేస్తుంది.

కొందరు తెలిసీ తెలీక ఏవో తప్పులు చేస్తారు. తెలీక చేసిన తప్పులయితే 'ఫర్వాలే దులే' అని క్షమించి వదిలేస్తారు వాళ్ళ పెద్దవాళ్ళు. కాని తెలిసి చేసిన తప్పులకి వాళ్ళని అటు దండించనూ లేక - ఇటు క్షమించనూ లేక.... 'మౌనముద్ర' వహిస్తారు కొందరి తలిదండ్రులు.

ఇలాంటి సమయాల్లో తప్పుచేసిన వాళ్ళు 'సున్నిత మనస్కు'లైతే... వాళ్ళకి వాళ్ళ పెద్దవాళ్ళ మౌనం కన్నా 'పెద్దశిక్ష' మరోటి ఉండదు!

ఒకవేళ తప్పుచేసిన వాళ్ళు 'దులిపేసుకునే' తత్వమున్నవాళ్ళయితే, వాళ్ళు తమ తలిదండ్రుల మౌనాన్ని 'చేతగానితనం'గా భావించి - మరింత పెట్రేగి, పతనమైపోతారే తప్ప తమని తాము సంస్కరించుకోలేరు!

ఇహపోతే రాజకీయాల్లో- ప్రత్యర్థులు తమ ఉనికి చాటుకోవడం కోసం చేసే కొన్ని చౌకబారు ఆరోపణలకి స్పందించి సమాధానమిచ్చేకన్నా - అధికారం కోసం, ఆస్తి కోసం - అధికార పక్ష కుటుంబ సభ్యులు వీధి కెక్కిన సంఘటనలపై ప్రతిపక్ష రాజకీయ నాయకులు తమ అభిప్రాయాలను ప్రకటించి 'సంచలనం' సృష్టించాలనుకునే కన్నా - 'నో కామెంట్' అంటూ మౌనంగా వుండిపోవడమే 'హుందా'గా వుంటుంది!

అలా అని అన్నింటికీ మౌనమే శ్రేష్టమైందనే భావనతో 'హింస'ని కూడా కిమ్మన కుండా భరిస్తూ ఉంటే - తప్పుడు ఆరోపణలకు సముచిత రీతిలో సమాధాన మివ్వకుండా 'ఉదాసీన వైఖరి' అవలంభిస్తే - అది మన 'అసహాయత'గా భావించి మరింత బాధించడానికే చూస్తారు కొందరు! అలాంటప్పుడు పిడుక్కీ, బియ్యానికీ ఒకే మంత్రంలా అన్నింటికీ మౌనం వహించకుండా- 'నోరువిప్పి' ప్రతిఘటించే శక్తిని అలవరచుకోవాలి!

16-3-1996